సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం । 15 । అక్టోబర్ । 2024



సోమశిలలో 52.012 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో సోమవారానికి 52.012 టీఎంసీలు ఉన్నాయి. ఎగువ నుంచి 7,500 క్యూసెక్కుల వరద వస్తుండగా, డెల్టాకు 50, ఉత్తరకాలువకు 50, దక్షిణ కాలువకు 6 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.78,350
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,120
3 శాతం జీఎస్టీతో	రూ.7,334
సవర (8 గ్రా)	రూ.58,672

గరిష్ఠం/కనిష్ఠం
26.1 /24.0

వాతావరణం

జిల్లాలో మంగళవారం ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. పిడుగులు పడే ప్రమాదం ఉంది. సోమవారం గాలో తేమ 98 శాతంగా ఉంది.

న్యూస్‌రీల్

జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండండి

- మాజీ మంత్రి కాకాణి విజ్ఞప్తి



నెల్లూరు (బారకాసు): జిల్లాకు తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో భారీ వర్షాలు, బలమైన పెనుగాలులు వీచే అవకాశం, పిడుగులు పడే ప్రమాదం ఉంటుందని, పశువుల కాపరులు, రైతులు, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని మాజీ మంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి కోరారు. ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అవసరమైతే తప్ప బయటకు వెళ్లకుండా ముఖ్యంగా చెట్ల కింద, కరెంటు స్తంభాల కింద ఉండకుండా ఇంట్లోనే సురక్షితంగా ఉంటూ జాగ్రత్తలు వహించాలని సూచించారు. ప్రధానంగా తీర ప్రాంత ప్రజలు, మత్స్యకారులు ఈ సమయంలో వేటకు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండి సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని ఆయన జిల్లా ప్రజలతో పాటు ముఖ్యంగా సర్వేపల్లి నియోజకవర్గ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

రాళ్లపాడుకు పెరుగుతున్న నీటిమట్టం

లింగసముద్రం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలకు రాళ్లపాడు ప్రాజెక్ట్‌కు నీరు చేరుతున్నట్లు జేఈ చంద్రమౌళి తెలిపారు. సోమవారం ఉదయం 7.8 అడుగులు ఉండగా సాయంత్రానికి 8.7 అడుగులకు నీరు చేరిందన్నారు. ప్రాజెక్ట్ ఎగువ ప్రాంతంలో వర్షాలు కురుస్తున్నందున మన్నేరు, పిల్లాపేరు ద్వారా నీరు చేరే అవకాశం ఉందన్నారు. అల్పపీడన ప్రభావం ఉన్నందున సోమశిల జలాశయం ఉత్తర కాలువ ద్వారా వచ్చే నీటిని సోమశిల అధికారులు నిలిపివేశారని చెప్పారు. కొండాపురం మండలం ఉప్పుటేరు నుంచి కూడా వర్షం నీరు మర్రిగుంట చెరువు మీదుగా ప్రాజెక్ట్‌కు చేరుతున్నట్లు చెప్పారు. అల్పపీడనప్రభావంతో ప్రాజెక్ట్ ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలు కురిస్తే ప్రాజెక్ట్ నిండే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.

రేపు కావలి, నెల్లూరుల్లో జాబ్‌మేళాలు

నెల్లూరు రూరల్: జిల్లా ఉపాధి కల్పన శాఖ కార్యాలయం ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఈ నెల 16న ఉదయం 10.30 గంటలకు కావలి, నెల్లూరుల్లో జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి వినయ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావలిలోని వైకుంఠపురంలో ఉన్న విక్రమసింహపురి పీజీ సెంటర్, నెల్లూరు మైపాడుగేటు రోడ్డులోని పాత చెక్‌పోస్టు వద్ద ఉన్న నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ కార్యాలయంలో ప్రముఖ కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేపడుతాయని పేర్కొన్నారు. 10వ తరగతి నుంచి డిగ్రీ పాసైన 18- 36 ఏళ్ల లోపు నిరుద్యోగ యువతి, యువకులు పాల్గొనాలని కోరారు. జాబ్‌మేళాకు నిరుద్యోగులు విద్యార్హతల సర్టిఫికెట్లు, బయోడేటా, ఆధార్ కార్డులను తీసుకురావాలని వివరించారు.

26న స్థాయీ సంఘ సమావేశాలు

నెల్లూరు (పొగతోట): జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈ నెల 26న 10 గంటల నుంచి నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ జె.మోహన్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీచైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన సమావేశాలు జరుగుతాయన్నారు. సమావేశాలకు జెడ్పీ సభ్యులు, ఆయా శాఖల జిల్లా అధికారులు తప్పక హాజరుకావాలన్నారు.

జిల్లాలో 54.2 మి.మీ వర్షపాతం

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లా వ్యాప్తంగా సోమవారం భారీ వర్షం కురిసింది. సగటున 54.2 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు కలెక్టరేట్ అధికారులు తెలిపారు. అత్యధికంగా ముత్తుకూరులో 50.4 మి.మీ. నమోదు కాగా, అత్యల్పంగా చేజర్ల మండలంలో 9.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. విడవలూరులో 31.2 అల్లూరు 21.0, కొడవలూరులో 30.0, బుచ్చిరెడ్డిపాళెం 16.0, కోవూరు 29.4, నెల్లూరు అర్బన్ 27.2, కలిగిరి 18.4, బోగోలు 33.2, సంగం 12.8, కావలి 33.4, తోటపల్లి గూడూరు 29.2, దగదర్తి 25.8, ఇందుకూరుపేట 35.8, వెంకటాచలం 39.4, మనుబోలు 25.2, జలదంకి 43.8, పొదలకూరు 24.2, సైదాపురం 16.2, నెల్లూరురూరల్ 28.6, రాపూరు 15.6, కందుకూరు 48.4, ఏఎస్‌పేట 28.8, గుడ్లూరు 25.2, ఆత్మకూరు 16.2, ఉలవపాడు 22.4, లింగసముద్రం 19.4, కలువాయి 22.24, కొండాపురం 23.6, మర్రిపాడు 27.4, వింజమూరు 45.2, దుత్తలూరు 23.2, వలేటివారిపాళెం 38.8, వరికుంటపాడు 12.4, ఉదయగిరి 32.4, అనంతసాగరం 12.4, సీతారామపురంలో 10.8 మి.మీ. వర్షపాతం నమోదైంది.

తమ్ముళ్లకు కిక్కే కిక్కు

జిల్లాలో మద్యం దుకాణాల కేటాయింపు ప్రక్రియ ముగిసింది. తొంబై ఐదు శాతం దుకాణాలు తమ్ముళ్ల సిండికేట్లకే దక్కాయి. దుకాణాలకు ఎవరైనా దరఖాస్తు చేయొచ్చని చెప్పినప్పటికీ, టీడీపీ సిండికేట్లు బెదిరింపులకు దిగారు. ఈ వ్యవహారంపై పెద్ద ఎత్తున దుమారం రేగడంతో పారదర్శకంగా నిర్వహిస్తామని ఎక్సైజ్ అధికారులు ప్రకటించినప్పటికీ టీడీపీ నేతలు వ్యూహాత్మకంగా వ్యవహరించారు. మద్యం దుకాణాలకు సంబంధించి దరఖాస్తుల ప్రక్రియ, లాటరీ అంతా పారదర్శకంగా జరిగినా.. టీడీపీ నేతలు తమ కుటుంబ సభ్యుల పేర్లతో దరఖాస్తులు చేసుకుని, చివరకు వారే దక్కించుకున్నారు.



కస్తూర్బా కళాక్షేత్రంలో కలెక్టర్ ఆధ్వర్యంలో లక్కీ డ్రా నిర్వహిస్తున్న ఎక్సైజ్ అధికారి

95 శాతం కూటమి నేతలకే దక్కిన దుకాణాలు

- ముగిసిన లాటరీ ప్రక్రియ
- ప్రొవిజినల్ లైసెన్సులు మంజూరు
- లైసెన్సు ఫీజు ద్వారా ప్రభుత్వ ఖజానాకు రూ.115.70 కోట్లు
- రేపటి నుంచి దుకాణాల ప్రారంభం

నెల్లూరు (క్రైమ్): మద్యం దుకాణాల కేటాయింపులో లాటరీ ప్రక్రియ వ్యాపారుల ఉత్కంఠ నిరీక్షణ నడుమ ప్రశాంతంగా ముగిసింది. ఈ నెల 16వ తేదీ నుంచి దుకాణాలు ప్రారంభం కానున్నాయి. జిల్లాలోని 182 మద్యం దుకాణాలకు 3,890 దరఖాస్తులు అందాయి. అధికారుల పరిశీలన అనంతరం సోమవారం నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో కలెక్టర్ ఓ ఆనంద్, జేసీ కార్తీక్ లక్కీడ్రా ద్వారా మద్యం దుకాణాలను కేటాయించారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన లక్కీడ్రా ప్రక్రియ మధ్యాహ్నం 1.30 గంటల్లోపే ముగిసింది. దుకాణాలను దక్కించుకున్న వ్యాపారులు వార్షిక లైసెన్సు ఫీజులో ఆరో వంతు చెల్లించి ప్రొవిజనల్ లైసెన్సులను పొందారు. మద్యం వ్యాపారులు, వారి సన్నిహితులతో కస్తూర్బా కళాక్షేత్రం పరిసర ప్రాంతాల్లో కోలాహల వాతావరణం నెలకొంది. లాటరీ ప్రక్రియ సజావుగా ముగియడంతో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ టి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏసీ దయాసాగర్, డీపీఈఓ శ్రీనివాసులనాయుడు ఊపిరి పీల్చుకున్నారు.



జేసీ కార్తీక్ ఆధ్వర్యంలో లక్కీ డిప్

24 షాపులు దక్కించుకున్న మహిళలు

మద్యం వ్యాపారంలో మహిళలూ పడ్డారు. దుకాణాలను దక్కించుకునేందుకు 150 మందికి పైగా దరఖాస్తులు దాఖలు చేశారు. లాటరీలో గెజిట్ సీరియల్ ప్రకారం 1, 2, 12 ,13, 16, 25 ,26, 29, 45, 54, 55, 72 ,82 ,90 ,92 ,120, 123, 128, 141, 142, 147, 154, 176, 180 దుకాణాలను వారు దక్కించుకున్నారు.

సిండికేట్ల మధ్య పోటీ

కూటమి నేతలు సిండికేట్లుగా ఏర్పడి దుకాణాలను దక్కించుకునేందుకు ఇతరులు దరఖాస్తులు వేయకుండా అడ్డుకునే ప్రయత్నాలు చేశారు. దీంతో అనేక మంది పాత వ్యాపారులు దరఖాస్తులు వేసేందుకు ఆసక్తి కనబరచలేదు. కొత్త వ్యక్తులు దరఖాస్తులు దాఖలు చేశారు. అయితే వీరందరూ కూడా అధికార పార్టీ నేతల ముఖ్య అనుచరులే కావడం గమనార్హం. నేతల సూచనలతో సిండికేట్‌లుగా ఏర్పడి నెల్లూరు నగరంలో 120, నెల్లూరు రూరల్‌లో 108 ఇలా పెద్ద ఎత్తున దరఖాస్తులు వేశారు. అయితే లక్కీడ్రాలో దురదృష్టం కొందరిని వెంటాడింది. వందల సంఖ్యలో దరఖాస్తులు వేసినా పట్టుమని పది కూడా రాకపోవడంతో తలలు పట్టుకున్నారు. ఒకే నియోజకవర్గంలో మూడు, నాలుగు సిండికేట్ల మధ్య పోటీ ఉండడంతో నష్టపోవాల్సి వచ్చిందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

రూ.193.50 కోట్లు ప్రభుత్వ ఖజానాకు

జిల్లాలో 182 దుకాణాల్లో రూ.85 లక్షల శ్లాబ్‌లో 38, రూ.65 లక్షల శ్లాబ్‌లో 48, రూ.55 లక్షల శ్లాబ్‌లో 98 మద్యం దుకాణాలు ఉన్నాయి. వీటికి 3,890 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుల రూపేణా రూ.77.80 కోట్లు ప్రభుత్వ ఖజానాకు ఆదాయం సమకూరింది. వార్షిక లైసెన్సు ఫీజు ద్వారా రూ.115.70 కోట్లు రావాల్సి ఉంది. వ్యాపారులు ఆరు విడతల్లో లైసెన్సుఫీజు చెల్లించాలి. లాటరీలో దుకాణాలు దక్కించుకున్న వ్యాపారులందరూ వార్షిక లైసెన్సు ఫీజులో 1/6వ వంతు చెల్లించారు. తద్వారా రూ.19.28 కోట్లు ఆదాయం వచ్చింది.

విజేతలపై ఒత్తిళ్లు ప్రారంభం

టీడీపీ నేతలు కాకుండా దుకాణాలు దక్కించుకున్న ఇతరులపై బెదిరింపులు, బేరాలకు కూటమి నేతలు దిగారు. నెల్లూరు నగరంలో వందల సంఖ్యలో దరఖాస్తులు వేసి నష్టపోయిన కూటమి నేతలు ఎలాగైనా దుకాణాలను దక్కించుకునేందుకు లక్కీడిప్‌లో దుకాణాలను దక్కించుకున్న వ్యాపారులతో సంప్రదింపులు ప్రారంభించారు. లాటరీ ప్రక్రియ జరుగుతుండగానే వారి ఫోన్ నంబర్లను సేకరించి దుకాణాలను తమకు వదిలేయాలని, లేని పక్షంలో పర్సెంటేజ్ ఇవ్వాలంటూ బెదిరించసాగారు. కూటమి నేతల బెదిరింపులతో వ్యాపారుల్లో ఆందోళన మొదలైంది. దుకాణాలను దక్కించుకున్న వ్యాపారులందరితో సమావేశాలు నిర్వహించేందుకు ఆయా ప్రాంత అధికార పార్టీ నేతలు చర్యలు చేపట్టారు. ఏం చేసైనా తమ అనుచరులు నష్టపోకుండా చేయాలన్న ఆలోచనతో నేతలు ముందుకు వెళుతున్నట్లు తెలుస్తోంది.

16 నుంచి దుకాణాలు ప్రారంభం

సోమవారం రాత్రితో ప్రభుత్వ మద్యం దుకాణాలను మూసివేసేందుకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు చర్యలు చేపట్టారు. 16వ తేదీ నుంచి ప్రైవేట్ మద్యం దుకాణాలు అందుబాటులోకి రానున్నాయి. దుకాణాల ఏర్పాటుకు రెండు రోజులే గడువు ఉండడంతో వ్యాపారులు సోమవారం రాత్రి నుంచే అందుకు తగిన ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

వరించిన అదృష్టం

- ఒక్కొక్కరికి రెండు, మూడు షాపులు

నెల్లూరు (క్రైమ్): మద్యం దుకాణాల లక్కీ డిప్‌లో కొందరు వ్యాపారులకు అదృష్టం వరించింది. ఒక్కొక్కరికి రెండు, మూడు షాపులు దక్కాయి. దీంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. నెల్లూరు నగరంలోని 3, 5 నంబర్ దుకాణాలను చిల్లకూరి లక్ష్మీరెడ్డి, వెంకటాచలంలోని 36, 37, ముత్తుకూరులోని 131వ నంబర్ దుకాణాలను అలి శోభన్‌బాబు, అల్లూరు నగర పంచాయతీలో 60, 61 నంబర్ దుకాణాలను మద్దిబోయిన వాసు, బుచ్చిరెడ్డిపాళెంలోని 82, సంగంలోని 92వ నంబర్ దుకాణాలను బొక్కా లక్ష్మీ, బుచ్చిరెడ్డిపాళెంలోని 86, 88వ నంబర్ దుకాణాలను అక్కల గంగాధర్ రెడ్డి, వింజమూరులోని 107, కలిగిరిలోని 111వ నంబర్ దుకాణాలను దమ్మలపాటి పాపారావు, ఇందుకూరుపేటలోని 122, ముత్తుకూరులోని 135వ నంబర్ దుకాణాలను కాసాని ఆదినారాయణ ఆత్మకూరులోని 139, కలువాయి 145వ నంబర్ దుకాణాలను పాలా పిచ్చిరెడ్డి దక్కించుకున్నారు. ఇక ఒకే కుటుంబంలోని వారికి సైతం దుకాణాలు దక్కాయి.

మద్య నిషేధానికి కొంగు బిగించి కదం తొక్కిన సింహపురి మహిళలే.. నేడు ఆ వ్యాపారంలో భాగస్వాములయ్యారు. మేము సైతం మద్యం విక్రయిస్తామంటూ ముందుకు వచ్చారు. కూటమి ప్రభుత్వం మహిళలతో మద్యం విక్రయాలకు శ్రీకారం చుట్టింది. ఆడదానికి ఆడదే శత్రువని కాపురాలు కూల్చే మద్యం వ్యాపారంలో అడుగు పెట్టి నిరూపించారు. సోమవారం మద్యం దుకాణాల కేటాయింపు ప్రక్రియ జరిగింది. జిల్లాలో దాదాపు 13.2 శాతం దుకాణాలను మహిళలు దక్కించుకున్నారు. మద్యం మహమ్మారితో కూలిపోతున్న కాపురాలను నిలబెట్టేందుకు విచ్చలవిడి విక్రయాలు జరగకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ అధీనంలో నడిపిస్తూ విక్రయాలను క్రమంగా తగ్గిస్తూ వచ్చింది. కానీ కూటమి ప్రభుత్వం ఆ మహిళల కాపురాల్లో మద్యం చిచ్చు పెట్టేందుకు అడుగులు వేసింది.

మేము సైతం..



మద్యం వ్యాపారంలో నారి

- జిల్లాలో మద్యం షాపులు దక్కించుకున్న 24 మంది మహిళలు
- టీడీపీ హయాంలో మద్యం షాపుల్లో మహిళలు భాగస్వాములు
- వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రభుత్వమే షాపుల నిర్వహణ

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ఉద్యమాల పురిటి గడ్డ సింహపురిలో మద్యపాన నిషేధానికి అంకురార్పణ జరిగింది. దూబగుంట రోశమ్మ ఆధ్వర్యంలో నారీ లోకం సారా నిషేధ ఉద్యమ నినాదాన్ని ఎలుగెత్తి చాటడంతో రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు కనువిప్పు కలిగేలా చేసింది. నెల్లూరు మహిళల స్ఫూర్తితో రాష్ట్రమంతటా మద్య నిషేధం అమలు జరిగింది. అలాంటి జిల్లాలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం మహిళలనే మద్యం వ్యాపారులుగా మార్చేసింది. కూటమి అధికారంలోకి వస్తే నాణ్యమైన మద్యం అందిస్తానని ఊదరగొట్టి గద్దెనెక్కిన ప్రభుత్వ పెద్దలు ఏకంగా మద్యం వ్యాపారంలో మహిళలను భాగస్వామ్యం చేశారు. మద్యం షాపులను ప్రైవేట్ పరం చేయడమే కాకుండా అందులో వారినే భాగస్వామ్యం చేయడంపై మహిళా సంఘాలు భగ్గుమంటున్నాయి. గత వైఎస్సార్‌సీపీ హయాంలో మద్యం వ్యాపారం ప్రైవేట్ పరం చేయకుండా ప్రభుత్వమే పారదర్శకంగా నిర్వహించింది. ప్రతి షాపులో ముగ్గురికి ఉపాధి అవకాశాలు కల్పించింది. బెల్ట్ దుకాణాలు లేకుండా ఎమ్మార్పీ ధరలకే మద్యం విక్రయాలు చేయించింది. పేద వర్గాలకు మద్యం అందుబాటులో లేకుండా ధరలు పెంచి విక్రయాలు చేసింది. ప్రతి ఏటా మద్యం దుకాణాల సంఖ్యను తగ్గిస్తూ వచ్చింది.

మహిళల పేర్లతో మద్యం షాపులు

జిల్లా వ్యాప్తంగా 182 మద్యం షాపుల ఏర్పాటు కోసం గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చింది. ఆయా షాపులకు పది రోజుల గడువులో 3,890 దరఖాస్తులు వచ్చాయి. కలెక్టర్ చేతుల మీదుగా జరిగిన లాటరీ విధానంలో 24 షాపులను మహిళలు దక్కించుకున్నారు. నెల్లూరు నగర కార్పొరేషన్‌తో పాటు బుచ్చిరెడ్డిపాళెం, దగదర్తి, ఏఎస్‌పేట, సంగం, జలదంకి, అనంతసాగరం, వలేటివారిపాళెం, లింగసముద్రం మండలాల పరిధిలో మహిళలకే షాపులు దక్కాయి. మహిళలు లైసెన్స్‌దారులుగా ఉన్న మద్యం షాపుల్లో ఏదైనా అక్రమాలు జరిగితే వారినే బాధ్యులను చేయాల్సి ఉంటుంది. అలాంటి పరిస్థితి ఎదురైతే మహిళలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. అయినా కూడా లెక్కచేయక టీడీపీ నేతలు ఎక్కువ మంది మహిళల పేర్లతో షాపులు వేసి అదృష్టాన్ని పరీక్షించుకున్నారు.





లక్కీ డిప్‌కు హాజరైన దరఖాస్తుదారులు, బయట వారి సన్నిహితుల హడావుడి



బారులు తీరిన కార్లు

జడి వాన

జిల్లాలో తెల్లవారుజాము నుంచి మొదలు

- పగలంతా చీకట్లు కమ్ముకున్న వైనం
- నీటి ముంపులో నగరంలోని లోతట్టు ప్రాంతాలు
- విద్యాసంస్థలకు అత్యవసర సెలవు
- మూడు రోజులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ హెచ్చరిక



సండే మార్కెట్ వీధిలో మోకాల్లోతు నీళ్లు

నెల్లూరు (దర్గామిట్ట): బంగాళాఖాతంలో తూర్పు ఆగ్నేయంగా కొనసాగుతున్న అల్పపీడనం బలపడుతున్న నేపథ్యంలో జిల్లా అంతటా సోమవారం తెల్లవారు జాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. రోడ్లతో పాటు నెల్లూరు నగరంలోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. భారీ వర్షం నేపథ్యంలో విద్యాసంస్థలకు కలెక్టర్ అత్యవసరంగా సెలవు ప్రకటించారు. జిల్లాస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు అధికారులకు సెలవులను రద్దు చేశారు. ప్రతి అధికారి క్షేత్రస్థాయి వరకు కేంద్రాల్లో ఉండాలంటూ ఆదేశాలు జారీ చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేయాలంటూ ఆదేశాలు జారీ చేశారు. పెన్నా పరివాహక ప్రాంతంలో కాలువలు, చెరువుల వద్ద ప్రత్యేకంగా పహారా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జిల్లా కేంద్రంలో డ్రెయిన్ల ద్వారా ఎప్పటికప్పుడు వర్షపు నీరు వెళ్లిపోయేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

క్షేత్రస్థాయి పర్యటనల్లో అధికారులు

కలెక్టర్, ఎస్పీల ఆదేశాల మేరకు డివిజన్ స్థాయి అధికారులు ఆయా మండలాల్లో అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ వాగులు పొంగి రహదారుల్లో రాకపోకలు నిలిచిపోయే ఆస్కారమున్న అన్ని ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. అవసరమైతే పునరావాస కేంద్రాలకు తరలిస్తామని, ఎలాంటి ఇబ్బంది ఉన్నా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచనలు చేస్తున్నారు. వాగులు పొంగితే అటు, ఇటు గ్రామాల ప్రజలు ప్రయాణాలు సాగించకుండా అధికారులు ముందస్తుగా అక్కడి ప్రాంతాలను పరిశీలించి తగు సూచనలు చేస్తున్నారు.

సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని చర్యలు : కలెక్టర్

జిల్లాలో భారీ వర్షాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ భారత వాతావరణ శాఖ ఇచ్చిన నివేదికల ఆధారంగా 14, 15, 16 తేదీల్లో వర్షాలు కురుస్తాయని తెలిపారని, అందుకు అనుగుణంగా సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. ఉదయం నుంచి కురుస్తున్న వర్షం జిల్లా వ్యాప్తంగా సగటున 54.2 మి.మీ.గా నమోదైందని వివరించారు. వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల నుంచి భారీగా వరద ప్రవాహం నమోదైన నేపథ్యంలో సోమశిల జలాశయంలో ఇంకా 20 టీఎంసీలకు పైగా నీటిని నిల్వ ఉంచుకునేందుకు అవకాశం ఉన్నందున దిగువకు నీటి విడుదల చేయాల్సిన అవసరం లేదన్నారు. లక్ష క్యూసెక్కులకు పైగా ఇన్‌ఫ్లో వచ్చిన సందర్భంలో నీటి విడుదల చేస్తే అప్పుడు ప్రజలను అప్రమత్తం చేస్తామని, అందుకు 24 గంటల సమయం పడుతుందని వివరించారు. పెన్నా పరివాహక లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తంగా ఉంచేందుకు అధికారులకు ఆదేశాలు ఇచ్చామని, మూడు రోజులు ప్రతినిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు. ఒక వేళ తుఫాను వస్తే సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటున్నామన్నారు.



కాంప్లెక్స్ రోడ్డులో వాగులా పారుతున్న దృశ్యం

లోతట్టు ప్రాంతాలు జలమయం

సోమవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి నగరంలోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ప్రధానంగా ట్రంకురోడ్డులో గాంధీబొమ్మ సెంటర్, సండేమార్కెట్ వీధి, విజయమహల్- కాంప్లెక్స్ రోడ్డుతో పొగతోటలోని కొన్ని వీధుల్లో మోకాల్లోతు నీళ్లు పారాయి. కొన్ని వీధుల్లో ఇళ్ల ముందుకు కాలువల్లో పేరుకుపోయిన చెత్తదారం కొట్టుకువచ్చాయి. ఆత్మకూరు బస్టాండ్, రామలింగాపురం, మాగుంటలేఅవుట అండర్ గ్రౌండ్ బ్రిడ్జిలతో పాటు విజయమహల్ అండర్ బ్రిడ్జిలో మూడు అడుగుల మేర నీళ్లు చేరడంతో వాహనాలు ముందుకు కదల్లేని పరిస్థితి ఏర్పడింది.

వాతావరణ శాఖ అధికారుల సూచనలు

ఆగ్నేయ బంగాళాతంలో ఏర్పడిన అల్పపీడనం అదే ప్రాంతంలో కొనసాగుతోంది. ఇది పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ మంగళవారం నాటికి దక్షిణ బంగాళాఖాతంలోని మధ్య భాగాలపై తీవ్ర అల్పపీడనంగా మారే అవకాశం ఉంది. ఆ తర్వాత ఇది పశ్చిమ వాయువ్య దిశగా ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, దానిని ఆనుకుని ఉన్న దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరాల వైపు తదుపరి 2 రోజుల్లో కొనసాగే అవకాశం ఉంది.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్

జిల్లాలో మూడు రోజుల పాటు వర్షాలు కురవనున్న నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. 0861-2331261, 79955 76699, 1077 నంబర్లు అందుబాటులో ఉంటాయని తెలిపారు. డివిజన్, మండల కేంద్రాల్లో సైతం కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయడం జరిగిందని, రెవెన్యూ నీటి పారుదలశాఖ అధికారులు పెన్నా గట్లు పరిశీలించాలని, సముద్ర తీరప్రాంత ప్రజలను సురక్షిత భవనాలకు తరలించాలని ఆదేశించినట్లు తెలిపారు.

జిల్లాలో మోస్తరు వర్ష సూచన

అనేక చోట్ల మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉంది. అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఉరుములు, మెరుపులతో కూడిన కొన్ని ప్రదేశాల్లో పిడుగులు పడే అవకాశం ఉంది. మంగళ, బుధవారాల్లో చాలా చోట్ల ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

నేడు పాఠశాలలు, కళాశాలలకు సెలవు

నెల్లూరు (టౌన్): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మంగళవారం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు సెలవు ప్రకటించినట్లు డీఈఓ రామారావు, ఆర్ఐఓ శ్రీనివాసులు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలను తప్పని సరిగా మూసివేయాలన్నారు.



నెల్లూరు నగరంలో పగలే చీకట్లు...



లోతట్టు ప్రాంతంలో ఇళ్ల ముందు వర్షపు నీరు



గాంధీబొమ్మ సెంటర్‌లో ..



ఆత్మకూరు బస్టాండ్ వద్ద అండర్ బ్రిడ్జిలో..



అండర్ బ్రిడ్జిలో వర్షపు నీటిలో బైకిస్టుల కష్టాలు

క్లుప్తంగా

నర్సింగ్ కాలేజీపై అధికారులకు ఫిర్యాదు



నెల్లూరు కలెక్టరేట్‌లో విద్యార్థినులు

కావలి: పట్టణంలోని శ్రీసాయి కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌లో మూడేళ్ల కోర్సును పూర్తి చేసుకున్న తమకు రూ.50,000 ఇస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని, లేకపోతే ఇంటర్న్‌షిప్ పరీక్ష పెట్టేది లేదని వేధిస్తున్నారంటూ విద్యార్థినులు కావలి ఆర్డీఓ ఎం.వంశీకృష్ణ దృష్టికి తీసుకెళ్లారు. సోమవారం బాధిత విద్యార్థినులు కావలి ఉమెన్ ఫోర్స్ సభ్యులతో కలిసి ఆర్డీఓను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం కళాశాల యాజమాన్యం తమను హాస్టల్లో ఉండనీయకపోవడంతో రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్‌స్టాప్‌ల్లో తలదాచుకుంటున్నామని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. విచారించి న్యాయం చేస్తామని ఆర్డీఓ చెప్పారు. అనంతరం వారు నెల్లూరు కలెక్టరేట్‌కు వెళ్లారు. విద్యార్థినులను ఆదుకోవాలని కావలి ఉమెన్ ఫోర్స్ కన్వీనర్ సి.శారద, సెక్రటరీ షేక్ ఫాతిమా, వైస్ ప్రెసిడెంట్ టి.సుజాత డిమాండ్ చేశారు.

నమ్మించి మోసం చేశాడని యువతి ఫిర్యాదు

మర్రిపాడు: ఉదయగిరి మండలం కుర్రపల్లి గ్రామానికి చెందిన ఓ యువకుడు పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని మర్రిపాడు మండలం చాబోలు గ్రామానికి చెందిన ఓ యువతి సోమవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారి కథనం మేరకు.. యువతి, యువకుడు మూడేళ్ల నుంచి ప్రేమించుకుంటున్నారు. అతను ఆమెను శారీరకంగా వాడుకున్నాడు. యువతి పెళ్లి చేసుకోవాలని సదరు యువకుడిని కోరగా అందుకు నిరాకరించాడు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా ఆమెను వైద్యపరీక్షల నిమిత్తం ఆత్మకూరు జిల్లా వైద్యశాలకు తరలించారు. యువకుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు.

అదుపుతప్పిన ఆర్టీసీ బస్సు



ఘటనా స్థలంలో బస్సు

దుత్తలూరు: మండలంలోని నందిపాడు సమీపంలో సోమవారం ఆర్టీసీ బస్సు అదుపు తప్పింది. రోడ్డు పక్కన చెట్లలోకి దూసుకెళ్లగా డ్రైవర్ అప్రమత్తతతో ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. బస్సు నెల్లూరు నుంచి ఉదయగిరికి వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. రోడ్డు మార్జిన్‌లో విద్యుత్ స్తంభాలు నాటడం కోసం, అలాగే టెలిఫోన్ తీగలు లాగడం కోసం గుంతలు తీసి పూడ్చకుండా వదిలేయడంతో తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి. అలాగే రోడ్డు మార్జిన్లలోకి చెట్లు విస్తరించడంతో ఈ గుంతలు కనిపించక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు వాపోతున్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

ఇందుకూరుపేట: పురుగు మందు తాగిన ఓ వివాహిత చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై నాగార్జునరెడ్డి సోమవారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని కొత్తూరులో చేపలు చెరువు వద్ద కాపలాగా ఉన్న ఎర్రా మునెమ్మ (26) అనే వివాహిత బిడ్డను కొట్టడంతో భర్త సుబ్రహ్మణ్యం మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన మునెమ్మ ఈనెల 11న గడ్డి మందును తాగి ఆత్మహత్యకు పాల్పడింది. అప్పటి నుంచి నెల్లూరులో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై వివరించారు.

మెట్ల కింద శిశువు మృతదేహం

నెల్లూరు(క్రైమ్): పురిట్లో మృతిచెందిందో.. ఏం జరిగిందో తెలియదు గానీ శిశువు మృతదేహాన్ని మెట్లకింద పడేసిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరులోని రామ్‌నగర్‌లోని మూడో వీధిలో ఓ విశ్రాంత పోలీసు అధికారి ఇంట్లో హుమేరా కుటుంబం నివాసం ఉంటోంది. ఆమె ఓ హోటల్లో పనిచేస్తూ జీవనం సాగిస్తోంది. అక్కడే ఒడిశాకు చెందిన తనూజాక్షితో పరిచయమైంది. ఆమె గర్భిణి కావడంతో హుమేరా వద్దనే ఉంటోంది. ఈ నేపథ్యంలో హుమేరా రెండు రోజుల క్రితం ఊరెళ్లింది. తనూజాక్షి పాపకు జన్మనిచ్చింది. శిశువు పురిట్లోనే చనిపోయిందో.. లేక ఏం జరిగిందో తెలియదు కానీ మృతదేహాన్ని గుడ్డలో చుట్టి మెట్ల కింద పెట్టేసి వెళ్లిపోయింది. సోమవారం రాత్రి మెట్ల కింద దుర్గంధం వెదజల్లుతుండగా గమనించిన హుమేరా 112కు కాల్ చేసి ఫిర్యాదు చేసింది. ఘటనా స్థలాన్ని దర్గామిట్ట ఎస్సై రమేష్‌బాబు పరిశీలించారు. శిశువు మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ప్రమాదం.. విషాదం

- పెళ్లిలో అప్పగింతలు పూర్తయ్యాక స్వగ్రామానికి బయలుదేరి..
- కారు బోల్తా పడి ఇద్దరు మహిళల దుర్మరణం
- ఒకరు పెళ్లి కుమార్తె అమ్మమ్మ, మరొకరు సమీప బంధువు
- మృతులు వరుసకు అక్కాచెల్లెళ్లు
- ఐదుగురికి తీవ్రగాయాలు



ఘటనా స్థలంలో కారు



సామ్రాజ్యం (ఫైల్)



సులోచన (ఫైల్)



సామ్రాజ్యం మృతదేహం



సులోచన మృతదేహం



గాయపడిన ప్రియదర్శిని



చికిత్స పొందుతున్న డ్రైవర్ సుకుమార్

వలేటివారిపాళెం: పెళ్లికెళ్లి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదం పలు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. ఇద్దరు మహిళలు చనిపోగా ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మండలంలోని శింగమనేనిపల్లి మలుపు వద్ద జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. పోకూరు గ్రామానికి చెందిన కనపర్తి రాజమ్మ కుమార్తె లావణ్యను నలదలపూరు గ్రామానికి చెందిన కోలా కొండలరావుకు ఇచ్చి ఆదివారం అర్ధరాత్రి వివాహం చేశారు. నలదలపూరులో జరిగిన ఈ పెళ్లికి పోకూరు నుంచి రాజమ్మ బంధువులు ఆటోల్లో, ఇతర వాహనాల్లో వెళ్లారు. వర్షం కురుస్తుండడంతో కొండలరావు లావణ్య కుటుంబసభ్యులను, బంధువులను పోకూరులో వదిలేసి వెళ్లాలని కారు డ్రైవర్ సుకుమార్‌కు చెప్పాడు. దీంతో అతను కారులో తొమ్మిదిమందితో బయలుదేరాడు. ఈ క్రమంలో శింగమనేనిపల్లి అడ్డ రోడ్డు మలుపు వద్దకు రాగానే ప్రమాదవశాత్తు కారు బోల్తా పడింది. అందులో ఉన్న పెళ్లి కుమార్తె అమ్మమ్మ కాలే సామ్రాజ్యం (సాంబమ్మ) (65), బంధువు లింగాబత్తిన సులోచన (52) అక్కడికక్కడే మృతిచెందారు. పిన్ని తుమ్మా అమరావతి, ఆమె కుమార్తెలు ప్రియదర్శిని, ఉదయశ్రీ, బంధువు పర్రె కొండయ్యలకు తీవ్రగాయాలయ్యాయి. కూనిపాళేనికి చెందిన డ్రైవర్ పులి సుకుమార్ కాలు విరిగింది. స్థానికులు గుర్తించి క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. అమరావతిని మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు, కొండమ్మను కందుకూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తీసుకెళ్లారు. కారులో ఉన్న మిగిలిన వారు ఎలాంటి గాయాలు లేకుండా బయటపడ్డారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.నాయుడు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సోమవారం మృతదేహాలను పరిశీలించారు.

కాసేపటికే..

అప్పటి వరకు పెళ్లిలో అందరూ సందడి చేశారు. అప్పగింతలు ముగించుకుని బయలుదేరిన పది నిమిషాలకే చావు కబురు అందడంతో రెండు కుటుంబాల్లో విషాదం నెలకొంది. కారు బయలుదేరి కిలోమీటర్ దూరం వెళ్లగానే ప్రమాదం జరిగి ఇద్దరు మృత్యువాత పడ్డారు. ఈ విషయం తెలియడంతో ఒక్కసారిగా నలదలపూరు, పోకూరు గ్రామాలు ఉలిక్కిపడ్డాయి. పోకూరు నుంచి పెళ్లికి వచ్చిన బంధువులు ఆటోల్లో, ఇతర వాహనాల్లో తిరిగి వెళ్తున్నారు. పెళ్లి కుమార్తె కుటుంబసభ్యులను కొండలరావు అద్దెకు వచ్చిన కారులో తీసుకెళ్లాలని చెప్పాడు. లావణ్య అమ్మమ్మ కాలే సామ్రాజ్యం, మరో అమ్మమ్మ లింగాబత్తిన సులోచన, పిన్ని తుమ్మా అమరావతి, ఆమె కుమార్తెలు ప్రియదర్శిని, ఉదయశ్రీలు, బంధువులైన పర్రె కొండమ్మ, హరికలు వీరంతా పోకూరు గ్రామానికి చెందిన వారే. పొన్నలూరు మండలం బాలిరెడ్డిపాళేనికి చెందిన రవణయ్య, రజినిలను కూడా కారులో ఎక్కించారు. మొత్తం తొమ్మిది మంది అందులో ఉన్నారు. అప్పటికే వర్షం కురుస్తోంది. ఈ నేపథ్యంలో త్వరగా వెళ్లాలని డ్రైవర్ సుకుమార్ కారును వేగంగా నడిపాడు. మలుపు వద్దకు రాగానే బ్రేక్ వేసినా ఆగలేదని, అదుపుతప్పి సైడుకు వెళ్లడంతో విద్యుత్ స్తంభం తగులుతుందని పక్కకు తిప్పడంతో కారు కాలువలో బోల్తా పడిందని డ్రైవర్ చెబుతున్నాడు.

అంతా ఆమే చూసుకుంది

పెళ్లి కుమార్తె లావణ్య కుటుంబం నెల్లూరులో నివాసం ఉంటోంది. ఆమె తండ్రి కుటుంబానికి దూరంగా ఉండడంతో అమ్మమ్మ సామ్రాజ్యం అన్ని విషయాలు చూసుకుంది. పెళ్లి సంప్రదాయాలు ఆమె ఇంటి వద్ద నుంచే జరిగాయి. బంధువులు కూడా ఆమె తరఫు వారే. అన్ని కార్యక్రమాలు సజావుగా జరిగినా తిరుగు ప్రయాణంలో ఆమె మృతిచెందడంతో కుటుంబసభ్యులు బోరున విలపిస్తున్నారు. సామ్రాజ్యంకు ఇద్దరు కుమార్తెలే కావడంతో మనుమరాళ్లు, మనుమళ్ల అలనాపాలనా అంతా ఆమె చూసుకుంది. మృతులిద్దరూ వరుసకు అక్కాచెల్లెళ్లు.

కన్నీరుమున్నీరు

సామ్రాజ్యం అలియాస్ సాంబమ్మను పోకూరు గ్రామ ముఠా మేస్త్రీగా పిలుస్తుంటారు. పొగాకు గ్రేడింగ్‌కు, వరి నాట్లకు, పొగాకు మొక్కలు వేసేందుకు ఇతర పనులకు కూలీలను తీసుకెళ్తుంటుంది. మేస్త్రీగా ఉండడంతో గ్రామంతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు బాగా పరిచయముంది. ఆమె మృతి విషయం తెలియగానే గ్రామస్తులు, మహిళా కూలీలు కన్నీరుమున్నీరయ్యారు. ఇంటింటికీ తిరిగి పనికి టైమ్ అయిందని కేకలు వేసి పేరు పేరునా పిలిచే సాంబమ్మ ఇక లేదని మహిళలు కంటతడి పెట్టుకున్నారు. రైతులు సైతం సోమవారం ఆమె మృతదేహాన్ని చూసేందుకు వచ్చారు.

కారు కొనుగోలు చేసి మూడునెలలే..

డ్రైవర్ సుకుమార్ కారు కొనుగోలు చేసి మూడు నెలలే అవుతోంది. జీవనోపాధి నిమిత్తం దానిని కొనుగోలు చేశారు. శుభకార్యానికి వెళ్లొస్తానని చెప్పాడని, చివరికి హాస్పిటల్లో చూడాల్సి వచ్చిందని కుటుంబసభ్యులు కంటతడి పెట్టారు.

విద్యుత్ సిబ్బందికి సెలవులు రద్దు

- నిర్దేశించిన కేంద్రాల్లోనే ఉండాలి
- విద్యుత్ భవన్‌తోపాటు ఏడు డివిజన్లలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు



విద్యుత్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న నోడల్ అధికారి ఆదిశేషయ్య

నెల్లూరు (వీఆర్సీసెంటర్): భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా సర్కిల్ పరిధిలోని విద్యుత్ సిబ్బందికి సెలవులు రద్దు చేశామని, అందరూ తక్షణమే విధుల్లో హాజరుకావాలని విద్యుత్ శాఖ నోడల్ అధికారి, చీఫ్ జనరల్ మేనేజర్ (సీజీఎం) కె.ఆదిశేషయ్య ఆదేశించారు. సోమవారం సాయంత్రం ఆయన విద్యుత్ భవన్ నుంచి విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుఫాన్‌గా మారే అవకాశం ఉన్నందున అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యుత్ సిబ్బంది వారికి కేటాయించిన కేంద్రాల్లోనే ఉండాలని ఆదేశించామన్నారు. వర్షం పడే సమయంలో, ఈదురుగాలులు వీచే సమయంలో విద్యుత్ స్తంభాలు, విద్యుత్ లైన్ల వద్ద ఉండొద్దని ప్రజలకు సూచించారు. వర్షాలు తగ్గే వరకు ప్రతి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఇద్దరు సిబ్బంది మాత్రమే ఉండాలని, మిగిలిన వారిని అత్యవసర సేవలకు ఉపయోగించుకోవాలని ఆదేశించారు. జిల్లా సర్కిల్ పరిధిలోని 7 డివిజన్లతో పాటు విద్యుత్ భవన్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని 24 గంటలు ఇదిలు పని చేస్తుందన్నారు. ప్రతి కంట్రోల్ రూమ్‌లో విద్యుత్ శాఖకు చెందిన ఒక జూనియర్ ఇంజినీర్‌ను నియమించామన్నారు.

నోడల్ ఆఫీసర్ల నియామకం

భారీ వర్షాల నేపథ్యంలో విద్యుత్ శాఖ అప్రమత్తమైంది. ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలోని అన్ని జిల్లాలకు సీఎండీ సంతోషరావు నోడల్ ఆఫీసర్లను సోమవారం నియమించారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని డివిజన్లలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. నెల్లూరు జిల్లా సర్కిల్‌లో విద్యుత్ సరఫరా, పునరుద్ధరణ పనులను పర్యవేక్షించేందుకు తిరుపతిలోని కార్పొరేట్ కార్యాలయానికి చెందిన చీఫ్ జనరల్ మేనేజర్ (ఎనర్జీ కన్జర్వేషన్, క్వాలిటీ కంట్రోల్ విభాగం) కె.ఆదిశేషయ్యను నోడల్ అధికారిగా నియమించారు. సర్కిల్ పరిధిలోని అన్ని డివిజన్లలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. ఎక్కడైనా విద్యుత్ స్తంభాలు పడిపోయినా, లైన్లు తెగిపోయినా వెంటనే సమీప అధికారుల దృష్టికి లేదా, టోల్‌ఫ్రీ నంబర్లు 1912, 1800 425 155333కు ఫోన్ చేసి సమాచారం అందించాలి. అదేవిధంగా 91333 31912 వాట్సప్ నంబర్‌కు విద్యుత్ సమస్యలపై సమాచారం అందిస్తే పరిష్కరిస్తారు.

జిల్లా సర్కిల్ పరిధిలోని కంట్రోల్ రూమ్‌ల ఫోన్ నంబర్లు

విద్యుత్ భవన్	
కంట్రోల్ రూమ్	94408 17468
నాయుడుపేట డివిజన్	73826 23178
గూడూరు డివిజన్	79010 36852
నెల్లూరురూరల్ డివిజన్	93818 15083
నెల్లూరు టౌన్ డివిజన్	79016 42857
కోవూరు డివిజన్	97052 00708
కావలి డివిజన్	79010 56437
ఆత్మకూరు డివిజన్	79010 56906

చేపల వేటకు విరామం



నేలటూరు తీరంలో పడవలు, వలలు

ముత్తుకూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఆదివారం రాత్రి నుంచి ముత్తుకూరు మండలంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. సముద్రం అల్లకల్లోలంగా తయారైంది. దీంతో మత్స్యకారులు చేపల వేటకు విరామం ప్రకటించారు. అధికారులు కూడా వేటకు వెళ్లొద్దంటూ హెచ్చరికలు జారీ చేయడంతో పడవలు, వలలను తీరంలోనే భద్రపరుచుకున్నారు. గంగపుత్రులు ఇళ్లకే పరిమితమయ్యారు. ఈదురుగాలులకు అలలు ఎగసిపడడంతో నేలటూరు పట్టపుపాళెం, కృష్ణపట్నం ఆర్కాట్‌పాళెం, రామ్‌నగర్, ఈపూరు పట్టపుపాళెం, కోనేటిమిట్ట తదితర గ్రామాల మత్స్యకారులు వేటకు సెలవు ప్రకటించారు.

చట్టపరిధిలో సమస్యలను పరిష్కరించండి



సమస్యలు తెలుసుకుంటున్న పోలీసు అధికారులు

నెల్లూరు(క్రైమ్): ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల్లో చట్టపరిధిలో ఉండే వాటిని సత్వరమే పరిష్కరించాలని ఏఎస్పీ సీహెచ్ సౌజన్య ఆయా ప్రాంత పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరిగింది. ఇందులో 30 మంది తమ సమస్యలను ఏఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి శ్రీహరి అనే యువకుడు మోసగించాడని రాపూరుకు చెందిన ఓ మహిళ ఫిర్యాదు చేశారు. కోవూరుకు చెందిన రవిశంకర్, రవి బాలాజీలు ఆర్థిక లావాదేవీల విషయంలో బెదిరిస్తున్నారని ఓ మహిళ తెలిపింది. తన భర్త వారం రోజుల నుంచి కనిపించడం లేదని బాలాజీ నగర్‌కు చెందిన ఓ మహిళ, ఇంకా భర్త, అత్తింటివారు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని వేదాయపాళేనికి చెందిన ఓ మహిళ పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ టీవీ సుబ్బారావు, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'చనిపోయాడని డాక్టర్లు చెప్పలేదు'

- క్షతగాత్రుడు రఫీకి వైద్యం అందించాం
- సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ సిద్ధానాయక్



మాట్లాడుతున్న సిద్ధానాయక్

నెల్లూరు(అర్బన్): బతికున్న వ్యక్తి మరణించాడంటూ మా ఆస్పత్రికి చెందిన డాక్టర్లు ఎవరూ చెప్పలేదని నెల్లూరు దర్గామిట్టలోని సర్వజన ఆస్పత్రి (పెద్దాస్పత్రి) సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్ వెల్లడించారు. బతికున్న రోగి చనిపోయాడంటూ సంబంధిత కుటుంబసభ్యులకు పోలీసులు సమాచారమిచ్చారంటూ సోమవారం మీడియాలో వార్తలు ప్రచురితమయ్యాయి. దీనిపై సూపరింటెండెంట్ స్పందించారు. ఈనెల 10వ తేదీ సాయంత్రం నార్త్‌రాజుపాళెం వద్ద యాక్సిడెంట్‌కు గురై అపస్మారక స్థితిలో ఉన్న రఫీ అనే వ్యక్తిని 108 అంబులెన్స్‌లో పెద్దాస్పత్రికి తీసుకొచ్చారన్నారు. రోగి వద్ద ఎవరూ లేకపోయినా తమ డాక్టర్లు క్యాజువాలిటీలో అడ్మిషన్ చేసుకుని వైద్యం అందించారన్నారు. తర్వాత రోజు ఎక్స్‌రే, సీటీ స్కాన్ పరీక్షలు చేయించామన్నారు. తొడ వద్ద ఎముక విరిగినట్లు తేలడంతో ఈ కేసును ఎముకలు, కీళ్ల (ఆర్థోపెడిక్) విభాగానికి అప్పగించామన్నారు. ఆర్థోపెడిక్ డాక్టర్లు ఆపరేషన్ చేయబోతున్నారన్నారు. కాలు ఫ్రాక్చర్ మినహా రోగి ఆరోగ్యంగా ఉన్నాడన్నారు. అయితే అతను మృతిచెందాడంటూ వచ్చిన వార్తలపై పూర్తిస్థాయి విచారణ జరిపానన్నారు. కేసు షీట్‌లో సైతం రోగి మరణించినట్టు రాయలేదన్నారు. రఫీ మృతిచెందాడని ఆయన భార్యకు ఎవరు చెప్పారని విలేకరులు ప్రశ్నించగా ఆమెను కూడా విచారించానన్నారు. పోలీసులు చెప్పారని వెల్లడించిందన్నారు. ఇంకా పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నానని ఇందులో డాక్టర్ల నిర్లక్ష్యం ఏమి లేదన్నారు.

రూ.లక్ష విలువైన బంగారం అప్పగింత



బంగారు ఆభరణాలను అప్పగిస్తున్న అధికారులు

కావలి: అల్లూరు బస్సులో ఆదివారం సాయంత్రం శ్రీహరికోట కుమారి అనే ప్రయాణికురాలు తన పర్సును మరిచిపోయింది. అందులో రూ.లక్ష విలువైన బంగారు ఆభరణాలున్నాయి. సదరు బస్సు కండక్టర్ ఎస్.వెంకయ్య గమనించి ఈ విషయాన్ని వెంటనే డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులుకు తెలిపారు. ఆయన ఆదేశాల మేరకు సూపరింటెండెంట్ (ట్రాఫిక్) ఎం.రామకృష్ణ పర్సులోని ఆధారాల మేరకు ఆ ప్రయాణికురాలిని గుర్తించి సోమవారం పిలిపించి కండక్టర్, ఇతర సిబ్బంది సమక్షంలో పర్సులోని బంగారం, రూ.3,640 నగదును అప్పగించారు. వెంకయ్యను అధికారులు అభినందించారు.

విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు సిద్ధం

- మంత్రి నారాయణ వెల్లడి



మాట్లాడుతున్న నారాయణ

నెల్లూరు(బారకాసు): జిల్లాలో మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశమున్న నేపథ్యంలో ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. అల్పపీడనం తుఫాన్‌గా మారితే ఈనెల 17న తీరం దాటొచ్చని వాతావరణ శాఖ తెలిపిందన్నారు. భారీ వర్ష సూచన నేపథ్యంలో ప్రభావిత ప్రాంతాల్లో అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామన్నారు. సోమవారం నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మంత్రి సమీక్ష నిర్వహించి అనంతరం మీడియాతో మాట్లాడారు. వర్షపు నీరు వెళ్లే కాలువల్లో పూడిక తీయించాలని మున్సిపల్ కమిషనర్లకు ఆదేశాలిచ్చామన్నారు. లోతట్టు ప్రాంతాల్లో నివాసం ఉండే వారిని వెంటనే పునరావాస కేంద్రాలకు తరలించే ఏర్పాటు చేశామని వెల్లడించారు. కమాండ్ కంట్రోల్ రూమ్స్‌కు విజయవాడ నుంచి ఆదేశాలిస్తున్నామని తెలిపారు. కలెక్టర్లు, అధికారులు లోతట్టు ప్రాంతాల్లో వారిని ఖాళీ చేయమని సూచిస్తే, ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): డీఎస్సీ - 2024కు సంబంధించి పేరున్న సంస్థల్లో ఉచిత డీఎస్సీ శిక్షణ పొందేందుకు గిరిజన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఐటీడీఏ పీఓ పరిమళ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష నిర్వహించి మెరిట్ ప్రాతిపదికన ఎంపిక చేసి మూడునెలల ఉచిత కోచింగ్‌తోపాటు భోజన, వసతి కల్పిస్తామన్నారు. ప్రాజెక్ట్ పరిధిలోని గిరిజన అభ్యర్థులు హెచ్‌టీటీపీఎస్://జ్ఞానభూమి.ఏపీ.జీఓవీ.ఇన్‌లో ఎస్‌డబ్ల్యూ అండ్ టిబ్ల్యూ డిపార్ట్‌మెంట్స్ మెగా డీఎస్సీ ఫ్రీ కోచింగ్ అనే లింకు ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు. ఈనెల 21వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వెరిఫికేషన్ అనంతరం 22 నుంచి 25వ తేదీ వరకు హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. 27 స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తామన్నారు. 28వ తేదీన మెరిట్ లిస్టును ప్రకటిస్తామన్నారు. ఎంపిక ప్రక్రియ ఆన్‌లైన్ ద్వారా మాత్రమే నిర్వహిస్తామన్నారు. వివరాలకు వైటీసీ వెంకటాచలం సెంటర్ మేనేజర్ బాలాజీ ఫోన్ నంబర్‌ను 81878 99877 సంప్రదించాలని కోరారు.

ఎస్సీ అభ్యర్థులకు..

డీఎస్సీ ఉచిత కోచింగ్ కోసం షెడ్యూల్ కులాలకు చెందిన అభ్యర్థులు సైతం దరఖాస్తు చేసుకోవాలని షెడ్యూల్ కులాల సంక్షేమ, సాధికారత అధికారి శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్జీటీ అభ్యర్థులు ఇంటర్మీడియట్‌తోపాటు డైట్‌సెట్, టెట్, స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థులు డిగ్రీ, బీఈడీ, టెట్ అర్హతలు కలిగి ఉండాలన్నారు. రూ.2.50 లక్షల్లోపు ఆదాయం గల వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇతర విషయాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

అల్లూరు: ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని ఇందుపూరు సమీప పొలాల్లో ఆదివారం రాత్రి జరిగింది. ఎస్సై కిశోర్ బాబు సోమవారం వివరాలు వెల్లడించారు. ఇందుపూరు దళితవాడకు చెందిన పులి కృష్ణ, పద్మ దంపతుల కుమారుడైన పులి మునేష్ (23) ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళన చెందారు. ఇందుపూరు నుంచి పురిణికి వెళ్లే మార్గం నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో తుమ్మ చెట్టు వద్ద మునేష్ ఉరేసుకుని ఉండడాన్ని పశువులకాపరులు గుర్తించి గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. వారు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. ఎస్సై సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి విచారించారు. మృతికి గల కారణాలు తెలియరాలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సోమవారం తెలిపారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.60
సన్నవి	: రూ.30
పండ్లు	: రూ.20



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 145
లేయర్ (లైవ్)	: 120
బ్రాయిలర్ చికెన్	: 258
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 284
లేయర్ చికెన్	: 204

అప్రమత్తంగా ఉండండి : ఎంపీ

నెల్లూరు(దర్గామిట్ట): భారీ వర్ష సూచన నేపథ్యంలో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సూచించారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. చెరువులు, కాలువలను పర్యవేక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధానంగా లోతట్టు ప్రాంతాలపై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. అవసరమైతే తప్ప ఎట్టి పరిస్థితుల్లోనూ బయటకు వెళ్లొద్దని ప్రజలకు సూచించారు.